## నేడు నూతన కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం...

**నాగర్‌కర్నూల్‌జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నూతన సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తరలించినందున ఈ నెల 12 సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నూతన సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదివారం పేర్కొన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి నూతన సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సకాలంలో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చే ఫిర్యాదుదారులు ప్రజలు మార్పును గమనించాలన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా డీఎన్ఆర్...

**ఊర్కొండ, జూన్ 11 ప్రభాతవార్త:**బాధిత కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉంటూ మాధారం గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ధ్యాప నికిల్‌రెడ్డి ఆర్థిక చేయూతనిస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, డీఎన్ఆర్ యువసేన సభ్యులు పేర్కొన్నారు. ఊర్కొండ మండలం బొమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన బోయ శ్యామలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జననేత, పేదల పెన్నిధి ధ్యాప నికిల్‌రెడ్డి తక్షణమే స్పందించి మృతురాలి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని సమకూర్చగా... మృతురాలి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకులు, డీఎన్ఆర్ యువసేన సభ్యులు పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి పేద కుటుంబంతో పాటు మండల ప్రజలకు ఎల్లవేళలా ఆదుకుంటూ ఎవ్వరికి ఏ ఆపద వచ్చిన నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆర్థిక చేయూతనిస్తున్నారని వారు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటయ్య, నాయకులు రాఘవేందర్, మల్లేష్, మురళి, దాసు, తాడెం ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



## నేటి నుంచి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు...

**-సీసీ కెమెరాల నిఘాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం...**

**కల్వకుర్తి, జూన్ 11 ప్రభాతవార్త:**నేటి నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఇంటర్ ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్, కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటలకు చేరుకోవాలని, 9 గంటల తర్వాత ఒక్క నిముషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాలకు అనుమతించబడదన్నారు. కల్వకుర్తి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, న్యూ ఎరా కళాశాల, వైఆర్ఎం కళాశాల, ఎంజేపీ కళాశాలల్లో పరీక్షలు కొనసాగుతా యని,విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోన్ కాకుండా పరీక్షలు వ్రాయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాలను సురేందర్ రెడ్డి ఆదివారం పరిశీలించా రు. కార్యక్రమంలో పరీక్షల కస్టోడియన్ వేణు, అధ్యాపకులు సదానందం, రాజేష్, మల్లేష్, రమాకాంత్, నయీం, శ్రీనివాస్, బాలరాజు, భీమేష్, గిరిబాబు, సంతోష్; లక్ష్మయ్య, కళాశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.



## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష...

**-68.93 శాతం హాజరు నమోదు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో, కల్వకుర్తి, అచ్చంపేటలో 19 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు మొత్తం 68.93 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో గ్రూప్-1 పరీక్షలకు 5130 అభ్యర్థులకు గాను 3536 మంది అభ్యర్థులు నేటి గ్రూప్-1 పరీక్షకు హాజరు కాగా 1594 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ నుంచి నేరుగా ప్రత్యక్షంగా పరీక్ష కేంద్రాలను సీసీ కెమెరాల వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు. అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్ పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

## రాధాకృష్ణకు సామాజిక సేవ సాంస్కృతిక పురస్కారం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బాదేపల్లి పట్టణంలో సాహిత్యసేవ సామాజిక సాంస్కృతిక సేవలకు ఆధ్యాత్మిక ధార్మిక కళాకారుడుగా కళాభిమానుడుగా కళా సేవకుడిగా భక్తి సమాజంలో సంస్కృతి కార్యక్రమాలు తన వంతు సాహితీ సేవకు డాక్టరేట్ పొందిన గోనెల రాధాకృష్ణకు సామాజిక సేవ సాంస్కృతిక పురస్కారం అందజేశారు. జడ్చర్లలో నిర్వహించిన సమావేశంలో హైకోర్టు సూపరింటెండెంట్ అంజలికుమారి, జడ్చర్ల మున్సిపల్ ఛైర్మన్ దోరేపల్లి లక్ష్మి చేతుల మీదుగా ఘనంగా శాలువా, మెమెంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణను స్థానికులు, కళాభిమానులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణమూర్తి, కౌన్సిలర్ సతీష్‌కుమార్, సంతోష్‌రెడ్డి, చెన్నయ్య,రాఘవేందర్, ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి పాల్గొన్నారు.



## రేషన్ షాపుల్లో 14రకాల వస్తువులు కేటాయించాలి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 11, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 10ఏండ్లు గడుస్తున్నా పేదలకు రేషన్ షాపుల ద్వారా 14 రకాల వస్తువులను ఎందుకు సరఫరా చేయడం లేదని, కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకోవడవ సమంజసం కాదని సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లే గోపాల్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల విపరీతంగా పెంచడం, జీఎస్టీ పేరుతో రాష్ట్రాల వాటాను లాక్కోవడం, ఫెడరలిజానికి తిలోదకాలు ఇవ్వడం తదితర ప్రజావ్యతిరేఖ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మోహన్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కురుమయ్య, డీవైఎఫ్ జిల్లా నాయకులు భానుప్రకాశ్ మాట్లాడుతూ పేదలకు ప్రవేశపెట్టిన ప్రభుత్వం పథకాలను అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేయాలని ఈనెల 12 నుం ఇ 18 వరకు సర్వేలు నిర్వహించి, 19న తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా, జూలై3న కలెక్టరేట్ ఆఫీసుల ఎదుట ధర్నా ఎమ్మెల్యేలకు, మంత్రలకు రాయబారాలు తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా పంపిణీ చేయాలని డిమాడ్ చేశారు. కార్యక్రమంలో భగవంతు,రాములు , జగన్ పాల్గొన్నారు.



## మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త :** జడ్చర్లలో ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గత మూడు నెలల నుండి నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో కోర్సు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ మహిళలు టైలరింగ్ వంటి స్వయం ఉపాధి శిక్షణలు పొంది ఆర్థికంగా లబ్ది పొందాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దోరెపల్లిలక్ష్మి,హైకోర్టు సూపరింటండెట్ అంజనికుమారి, ప్రిన్సిపాల్ నారాయణస్వామి, కౌన్సిలర్ సతీష్, బాలమణి, గోపాల్‌గౌడ్, 3టి టివి ఛైర్మన్ కడమంచి చెన్నయ్య, డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, డా. రాధాకృష్ణ, రాఘవేందర్, భాష,గౌస్,మహిళలు పాల్గొన్నారు.



# తెలంగాణ ఔనత్యాన్ని చాటి చెప్పిన కవి సమ్మేళనం...

- **అలరింపజేసిన దశాబ్ద తెలంగాణ అస్తిత్వం...**
- **ప్రగతిని ప్రతిబింబించేలా కవిత గానాలు**
- **సమాజాన్ని చైతన్యపరిచే శక్తి కవులకే ఉంది...**
- **అదనపు కలెక్టర్ మనుచౌదరి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త:**ఎప్పుడైనా, ఏ సమయంలోనైనా సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి కవికి మాత్రమే ఉందని అదనపు కలెక్టర మనుచౌదరి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నాగర్‌కర్నూల్ నూతన సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సమాచార పౌర సంబందాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా నిర్వహించిన కవి సమ్మేళనం అలరింపజేసింది. ఈ కవి సమ్మేళనానికి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల మనుచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 53 మంది కవులు తరలివచ్చి తమ సందర్భోచిత కవితా వచనాలతో సమ్మేళనానికి వన్నెలద్దారు. ఒకరికొకరు దీటుగా దశాబ్ద తెలంగాణ ప్రగతిని ప్రతిబింబించేలా అక్షర విన్యాసాలు, పదబంధాలను ప్రయోగిస్తూ సాహితీ పిపాసుల మనస్సులను రంజింపజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఎంతో మంది అమరుల త్యాగాల ఫలితంగా రాష్ట్ర ఏర్పాటైందని, పోరాడి సాధించుకున్న తెలంగాణ ఈ దశాబ్ద కాలంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్దించి 10 వసంతాలు నిండుతున్నందున తెలంగాణ స్ఫూర్తిని ఈనాటి అభివృద్ధిని కవుల ద్వారా తిరిగి వినడం అద్భుతంగా ఉందని, ఎప్పుడైన ఏ సమయంలోనైనా సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి కవికి మాత్రమే ఉందన్నారు. ఎంతో మంది కవులు పద్య, వచన కవితల ద్వారా తెలంగాణ పోరాటంలోనే కాకుండా సమాజంలో జరిగే అన్యాయాలపై కూడా ప్రజలను ఉత్తేజితులను చేశారన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్ మాట్లాడుతూ కవిత్వం, సాహిత్యం వ్యక్తుల వ్యక్తిత్వానికి పునాదులని ఆయన పేర్కొన్నారు. మానవ సంబంధాలు అంతరించిపోతున్న ఈ కాలంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల సమాజాన్ని చూడగలుగుతామన్నారు. ఇంత ఘనంగా కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు జిల్లా పౌర సంబంధాల అధికారి సీతరాంను అభినందించారు. అదే విధంగా డీపీఆర్ఓ సీతరాం మాట్లాడుతూ కందనూలు జిల్లా కవులకు ప్రసిద్ది అని, కవులు తమ కవిత గానంతో సమాజాన్ని ప్రభావితం చేస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కవి సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, కవుల గానం వాటి ప్రాముఖ్యతను ఆయన వివరించారు. కవి సమ్మేళనానికి హాజరైన కవులను సన్మానించి మెమెంటోలు బహుకరించి కొంత మేర నగదు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నర్సింగరావు, డీపీఓ కృష్ణ, మిషన్ భగీరథ ఈఈ, జిల్లా యువజన సర్వీసుల క్రీడల శాఖ అధికారి నటరాజ్, కవులు, కళాకారులు తదితరులు ఉన్నారు.



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్



సన్మాన గ్రహీత కవులతో అదనపు కలెక్టర్ మనుచౌదరి

# అక్రమంగా నీటి వాటాను ఆంధ్రాకు తరలిస్తున్న పట్టించుకోని సీఎం కేసీఆర్...

**- అచ్చంపేట బీజేపీ నియోజకవర్గ నేత దేవినేని సతీష్‌మాదిగ**

**వంగూరు, జూన్ 11 ప్రభాతవార్త:**త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని భ్రష్టు పాలు పటిస్తూ ఉద్యమ సమయంలో నీళ్లు, నిధులు, నియామకాలనే పేరుతో మా వాటా మాకే దక్కాలని ప్రసంగాలు చేసి అమాయకమైన విద్యార్థులు, యువత, నిరుద్యోగులను ఆత్మహత్యలు చేసుకునే విధంగా ప్రేరేపించి నేడు అదే ఆంధ్రా పాలకులతో చేతులు కలిపి తెలంగాణలో చేపడుతున్న ప్రతి పనిని ఆంధ్రా కాంట్రాక్టర్లకు అప్పగించి తెలంగాణ సంపదను ఆంధ్రాకు తరలించేందుకు సీఎం కుట్రలు పన్నుతూ ఆగం చేస్తున్నారని అచ్చంపేట బీజేపీ నియోజకవర్గ నేత దేవినేని సతీష్‌మాదిగ ఎద్దేవా చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలను స్వరాష్ట్రం ఏర్పడితే ఎవడో ఇచ్చేదేమిటి... మనమే చేసుకోవచ్చునని ప్రగల్బాలు పలికి నేటికి నియామకాలు చేయకుండా, కృష్ణా జలాలను ఆంధ్రాకు తరలించుకొని పోతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి కండ్లు అప్పగించి చూస్తున్నారే తప్ప అడ్డుకోకపోవడం సిగ్గుచేటుకరమని ఆయన విమర్శించారు. ఆదివారం అచ్చంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించి 9 సంవత్సరాలు గడుస్తుండటంతో రాష్ట్ర ఏర్పాటుకు 3ప్రధానమైన డిమాండ్లను పెట్టుకొని ఉద్యమం చేసిన కేసీఆర్ అనాటి నీళ్లు, నిధులు, నియామకాల డిమాండ్లను మరిచి తెలంగాణ ప్రజలకు అన్యాయం చేస్తున్నారని అచ్చంపేట బీజేపీ నియోజకవర్గ నేత దేవినేని సతీష్‌మాదిగ ఆరోపించారు. తెలంగాణలో కృష్ణా నదీ జలాల 599 టీఎంసీ వాటాలు 299 టీఎంసీలను కేటాయించినట్లు సంతకాలు చేసిన సీఎం కేసీఆర్ ఆంధ్రా ప్రాంతానికి 511 టీఎంసీలు జగన్మోహన్‌రెడ్డి అక్రమంగా తరలించుకుపోతుంటే సీఎం కేసీఆర్ జగన్మోహన్‌రెడ్డికి అమ్ముడుపోయి నోరు మెదపడం లేదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు 500 టీఎంసీల వాటా రావాల్సిందేనని, విద్యుత్ కోసం నిర్మించిన శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను అక్రమగా పోతిరెడ్డిపాడు నుంచి 10 పైపులైన్ల ద్వారా రాయలసీమకు తరలిస్తున్నది సీఎంకు కనిపంచడం లేదా అన్నారు. సోమశిల, సంగమేశ్వర, శ్రీశైలం ప్రాజెక్టుల ద్వారా అక్రమంగా కాల్వలు తీసి కృష్ణానదీ నీటిని తీసుకొని పోవడానికి భారీగా కుట్రలు పన్నిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఆంధ్రా పాలకులకు మద్దతు పలుకుతూ ప్రాజెక్టులకు అనుమతులు లేవని మాట్లాడకుండా కృష్ణా నదీ జలాలను ఆంధ్రాకు తరలించడానికి సిద్ధంగా ఉన్నారని, ఈ కుట్రలను తిప్పికొట్టడానికి సిద్ధం కావాలని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రా కాంట్రాక్టర్లు నియామకాలతో నీళ్లు, నిధులు, నియామకాలను దోచుకుంటూ 1400 మంది తెలంగాణ అమరవీరుల ఆత్మఘోషించేలా సీఎం కేసీఆర్ విధి విధానాలను అమలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని భ్రష్టు పటిస్తున్న కేసీఆర్‌ను రాజకీయంగా బొంద పెట్టేందుకు రానున్న ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న అచ్చంపేట బీజేపీ నియోజకవర్గ నేత దేవినేని సతీష్‌మాదిగ

# దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం...

**-దేవాలయాభివృద్ధి రూ.5,00,116 విరాళం అందజేత... -కబడ్డీ కరాటే అసోసియేషన్ ఛైర్మన్ ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి**

**ఊర్కొండ, జూన్ 11 ప్రభాతవార్త:**దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహద పడుతాయని కబడ్డీ కరాటే అసోసియేషన్ ఛైర్మన్ ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఊర్కొండ మండలంలోని మాధారం గ్రామంలోని శ్రీ శివ సీతారామాంజనేయ స్వామి ఉపాలయాల ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా కబడ్డీ కరాటే అసోసియేషన్ ఛైర్మన్ ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో జనార్ధన్‌రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవ మార్గాన్ని అనుసరించి కుటుంబంలో, సమాజంలో సుఖ సంతోషాలు విరజిల్లుతాయని, అధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతి ఒక్కరు దైవ్య చింతన కలిగి ఉండాలన్నారు. దేవాలయాభివృద్ధి రూ.5,00,116 భారీ విరాళాన్ని దేవాలయకమిటీ సభ్యులకు అందించారు.కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో కబడ్డీ కరాటే అసోసియేషన్ ఛైర్మన్ ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి

## ముదిరాజ్‌లకు కూడా లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించాలి

**ముదిరాజ్‌లకు 10 వేల కోట్లతో ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి**

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా, మక్తల్ మండల కేంద్రంలోని ఐబి దగ్గర నిర్వహించిన ముదిరాజ్‌ల సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ యువసేన నారాయణపేట జిల్లా ఇంచార్జి బొంబాయి విజయ్ ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి ఏలిగెండ్ల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిసి కులస్తులలోని కులవృత్తుల వారికి మాత్రమే లక్ష రూపాయల ఆర్థిక సాయం చేస్తామని చెప్పడం విడ్డూరమని అన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలోని బిసి కులస్తులలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుని, వాళ్లకు న్యాయం చేయడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిసి కులస్తులలోని ఎంపిక చేయని ముదిరాజ్ కులాలలో కూడా ఆర్థిక స్తోమత లేక కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారిని ప్రభుత్వం గుర్తించి ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ముదిరాజ్‌లకు 10 వేల కోట్లతో ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దండు అశోక్, నాగేష్, రాజు, నర్సింలు, గంపరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముదిరాజ్ యువసేన నాయకులు

# గద్వాలకు కెసిఆర్ వచ్చే అర్హత లేదు..!

**బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి**

**సీఎం కెసిఆర్ ఇచ్చిన హామీలను అమలు చేసి గద్వాలకు రావాలి :బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి**



మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

**గద్వాల ప్రతినిధి,జూన్11 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో ఆదివారం డికె బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈనెల 12న గద్వాలకు ముఖ్యమంత్రి కెసిఆర్ కలెక్టరేట్ సమీకృత, ఎస్పీ కార్యాలయం ప్రారంభోత్సవానికి వస్తున్నారని జిల్లాలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గద్వాలకు వచ్చే అర్హత లేదని అన్నారు. ఎన్నికల సమయంలో భావితరాలు రాజకీయాలను అసహ్యించుకునే దౌర్భాగ్యస్థితి నేడు తెలంగాణ రాష్ట్ర దాపురించింది. నిజంగా తెలంగాణ ఆకాంక్షతో ఎగిసిపడిన ఆవేశాన్ని ఆసరాగా చేసుకుని ప్రజల మనోభావాలతో ఆటలాడుతున్నారు. అందులో భాగంగా మీరు తొమ్మిదేళ్లలో యావత్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. మీ మాయల మరాఠితనంతో రాళ్లతో కొట్టి చంపండి, తల నరుక్కుంటా గొంగళి పురుగునైనా ముద్దాడుతా, కాపలా కుక్కలాగా ఉంటా, బొందపెడుదాం గాడిదకు గడ్డివేసి ఆవుకు పాలు పిండడం లాగులు తడుస్తాయి, చవటసన్నాసులు, సిగ్గులేని దద్దమ్మలు గాయిరాయి గత్తర గత్తరగా తూ మీ బతుకులు చెడా ఇలా ఎన్నెన్నో పదాలు ప్రయోగించి తెలంగాణ యాసను కూడా భ్రష్టు పట్టించిన ఘనులు మీరు సకల జనుల సమ్మెతో సాధించుకున్న సబ్బండ వర్గాల కలల రాష్ట్ర సౌధాన్ని కూల్చివేసిన ఘనపాటి మీరు అన్నది కాదనలేని వాస్తవం అన్నారు. సంవత్సరానికి 5 వేల డబుల్ బెడ్ రూంలు ఇస్తామని ఇవ్వలేదని, ఫుడ్‌పార్కు ఏర్పాటు, ఐటిఐ కళాశాల ఏర్పాటు, జూరాల డ్యాంపై సమాంతర బ్రిడ్జి నిర్మాణం, జూరాల వద్ద పార్కు, నిరుద్యోగ భృతి, దళితులకు మూడు ఎకరాల భూమి, ముస్లింలకు ఉర్దూ షాదీఖానా ఏర్పాటు, గద్వాల ఈద్గా అభివృద్ధికి ప్రత్యేక నిధులు, గద్వాలలో మెడికల్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు, సోలార్ పవర్ ఏర్పాటు, కెజి టు పిజి ఉచిత విద్య, చేనేత పార్కు ఏర్పాటు అలంపూర్‌లో బస్సు డిపో, రాష్ట్రం ఏర్పడక ముందే మాజీ మంత్రి డికె అరుణ హయాంలో 90 శాతం పనులు పూర్తి చేసుకున్న నెట్టెంపాడు ప్రాజెక్టును తొమ్మిదేళ్లయినా ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారని అన్నారు. తొమ్మిది సంవత్సరాలుగా జూరాల ప్రాజెక్టు డ్యాం సరైన నిర్వహణ కరువై దయనీయంగా మారిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కృష్ణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండ్ల వెంకటరాములు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి శ్రీను, కౌన్సిలర్ త్యాగరాజు, రాష్ట్ర ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి నాగేందర్ యాదవ్,మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు గీతరెడ్డి, మోహన్‌రెడ్డి,గణేష్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హత్ సే హత్ జోడో కార్యక్రమం..

**కల్వకుర్తి, జూన్ 11 ప్రభాతవార్త:**కల్వకుర్తి మున్సిపల్ పరిధిలోని భగత్ సింగ్ తండాలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో హత్ సే హత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. తాండలో కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణగావించారు. తాండలో ఇంటింటికి తిరిగి హత్ సే హత్ జోడో అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఇండ్లు లేని వారికి పక్కా ఇండ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామ న్నారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లెపల్లి జగన్, అనిల్‌గౌడ్, బాలరాజు, సుదర్శన్, అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.



## గద్వాలలో ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలి



**ఇటిక్యాల, జూన్11 ప్రభాతవార్త:**గద్వాలజిల్లా కేంద్రంలో సోమవారం నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాల యం, బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభించడానికి ముఖ్యమంత్రి కెసిఆర్ వస్తున్నారన ప్రారంభోత్సవం అనంతరం రైల్వే స్టేషన్ సమీపం మేళచెరువు రోడ్డు చౌరస్తా వద్ద జరిగే కార్యకర్తల బహిరంగ సభను విజయవంతం చేసేందుకు అలంపూర్ నియోజకవర్గం నుండి గ్రామాల నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలని అలంపూర్ నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ మాజీ ఇంఛార్జి మంద శ్రీనాథ్ పిలుపునిచ్చారు.

## ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన హామీలకు సమాధానం చెప్పాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

పథకం శంకుస్థాపన చేశారు కానీ వాటి పనులు పూర్తి కావడం లేదని, అదేవిధంగా గద్వాల చేనేత కార్మికుల కొరకు అనంతపురం శివారులో టెక్స్‌టైల్ పార్కు నిధులను లేవని కృష్ణానది మధ్యలో ఉన్న గుర్రంగడ్డ బ్రిడ్జి నిర్మాణం ఇప్పటికి పూర్తి కాలేదని అదేవిధంగా ఐజ పులికల్ ప్రధాన రహదారి నిర్మాణం పూర్తికాక ప్రజలు అవస్థలు పడుతున్నారని ఇలాంటి ఎన్నోహామీలు ముఖ్యమంత్రి ఇచ్చి 9 ఏళ్లు అవుతున్నా అవి పరిష్కారం కావడం లేదని ఆయన విమర్శించారు. అలంపూర్ గద్వాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయేందుకు రైతులు, విద్యార్థులు చేనేత కార్మికులు తదితర రంగాలకు చెందిన వారిని ఐదుగురు చొప్పున ముఖ్యమంత్రిని కలిసేందుకు అవకాశం ఇవ్వాలని కలెక్టర్‌ను కోరినట్లు అవకాశం ఇవ్వకపోతే కాంగ్రెస్‌పార్టీ తరపున కార్యాచరణ ప్రకటిస్తామని వీరు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి గద్వాల జిల్లాకు వస్తుండగా కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందని అదే విధంగా 9 ఏళ్లుగా ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు గద్వాల అలంపూర్ ప్రజలకు ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పాలని ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సమావేశంలో అలంపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## గోల్కొండ కవుల సంచికతో విమర్శకులకు సమాధానం..

మొదటి పేజీ తరువాయి భాగం..

వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్‌గణేశ్,నాయకులు జూపల్లి భాస్కర్‌రావు,శ్రీనివాస్‌రెడ్డి, వడ్డెరుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటస్వామి, ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూమయ్య, వడ్డెర చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రంగయ్య, రాములు, యాదయ్య,కథలయ్య,ఊషన్న,యాదయ్యపాల్గొన్నారు.



# తగ్గని భానుడి ప్రతాపం



- వేసవికాలం ముగుస్తున్న పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో జనాల ఉక్కిరిబిక్కిరి
- ఏసీలు కూలర్లు ఎన్ని వాడినా దక్కని ఉపశమనం
- ఎండ తీవ్రత వల్ల వ్యాపారస్తులకు సైతం తీవ్ర నష్టం
- ఇంట్లో నుండి బయటికి రావాలంటే జంకుతున్న జనాలు



వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా మారిని రోడ్లు



రూ.5వేలు దాటిన కరెంటు బిల్లు

**వనపర్తి వైద్య విభాగం,జూన్11,ప్రభాతవార్త:** ఏటేటా పెరుగుతూ వస్తున్న ఎండల వల్ల జనాలు అల్లాడుతున్నారు. సహజంగా జూన్ మొదటివారం ప్రారంభం అయ్యే సరికి నైరుతి రుతుపవనాల రాకతో ఎండల తీవ్రత తగ్గి వాతావరణం చల్లబడుతుండేది. కానీ ఈ సంవత్సరం ఇప్పటికే నైరుతి రుతు పవనాలు కేరళాను తాకాయి. జూన్ మాసం ప్రారంభమై వారం రోజులు గడిచిన ఉష్ణోగ్రతలు 35డిగ్రీల నుండి 40 డిగ్రీల వరకు నమోదు అవుతుండడాన్ని బట్టి ఎండలు ఎంత అధికంగా ఉన్నాయో చెప్పవచ్చు. భానుడి ఉగ్ర రూపానికి జనాలు బయటికి రావడానికి భయపడుతుంటే మరోపక్క వ్యాపా రస్తులు సైతం తమ వ్యాపారాలు సరిగ్గా జరగడం లేదని చింతిస్తున్నారు. ప్రస్తుతం పెళ్లిల సీజన్ కావడం వల్ల వ్యాపారులకు సహజంగా మంచిగానే వ్యాపారాలు నడిచేవి. కానీ ఎండ తీవ్రత వల్ల జనాలు బయటికి రాకపో వడం, వచ్చిన కొనుగోలుదారుల కోసం ఏసీలు కూలర్లు ఎన్ని వినియోగించిన ఫలితం మాత్రం లేదు. పైగా కరెంటు బిల్లులు ముందు కంటే నాలుగింతలు పెరిగాయని వ్యాపారస్తులు వాపోతున్నారు. గతంలో రూ.1500 వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు రూ.5వేలు దాటడం గమనార్హం.

**చిన్నారుల పరిస్థితి ఏంటో:** ఉక్కపోతతో యువకులు సైతం తట్టుకోలేక పోతున్న వేళ సోమవారం నుండి పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కాబోతున్న తరుణంలో చిన్నారుల పరిస్థితి ఏంటో అని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విపరీతమైన వడగాలులు, ఉక్కపోతలతో జనాలు రోడ్లపైకి రావాలంటేనే అయోమయానికి గురవుతున్నారు. ఈ తరుణంలో పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమవుతుండగా కళాశాలల విద్యార్థులు ఉక్క పోతకు ఎలాగోలా తట్టుకోగలరు కానీ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారుల పరిస్థితి ఏమిటోనని పలువురు వాతావరణ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో మార్పులు చేసుకుని చల్లదనం ఏర్పడకపోతే పాఠశా లలకు వెళ్లే చిన్నారులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం కూడా మెండుగా ఉన్నాయి.

## వ్యాపారాలు సైతం అంతంత మాత్రమే



వేసవికాలానికి ముందు చాలా మంచి వ్యాపారం జరిగేది. ఇప్పుడు పెళ్లిల సీజన్ రావడం వల్ల వ్యా పారం పెరుగుతుందని సంతోషిం చాం కానీ జనాలు బయటికి రాకపో వడం, షాపులలో ఉక్కపోత తట్టుకోలేక ఏసీలు, ఫ్యాన్లు ఎన్ని వాడినప్పటికీ ఉపశమనం లభించకపోగా కరెంటు బిల్లు చాలా ఎక్కువగా వస్తున్నాయి.

**- డి.దామోదర్ ,వస్త్రాల వ్యాపారి, వనపర్తి**

## బయటికి వస్తే జాగ్రత్తలు పాటించాలి



ఎండల తీవ్రత వల్ల ఇంట్లో నుండి బయటకు వస్తే తగు జాగ్రత్తలు పాటించాలి. ఏవైనా పనులుఉంటే ఉదయం 10గంటల లోపు పూర్తి చేసుకోవాలి లేదా సాయంత్రం 5 గంటల తరువాత చేసుకోవడం మంచిది. ఎట్టి పరిస్థితుల్లో మధ్యాహ్నం బయటికి రావాల్సి వస్తే గొడుగు వెంట తెచ్చుకోవాలి. ఎండల తీవ్రత వల్ల ఇప్పటికే జిల్లాలో అన్ని పీహెచ్‌సీలలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాము. వాటిని ఎలా వాడాలో ప్రజలకు వివరించడానికి వైద్య సిబ్బందికి తగిన శిక్షణ కూడా ఇచ్చాము. ముఖ్యంగా శీతల పానీయాలు నిమ్మరసం, కొబ్బరి నీరు, పండ్ల రసాలు , మజ్జిగ తరచు తీసుకోవడం చాలా మంచిది. చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు పాటించాలి.

**- డాక్టర్ సాయినాథ్ రెడ్డి, జిల్లా ప్రోగ్రాం అధికారి, వనపర్తి**

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**వెల్దండ, జూన్11 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 సంౝలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన అనాటిగురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఒకరి యోగా క్షేమాలను ఒకరు అడిగి తెలుసుకొని అనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మురళి,కృష్ణ,కోటి,రాజేందర్‌రెడ్డి, రవిందంరెడ్డి,రమేష్,అంజన్‌కుమార్, రమేష్‌రెడ్డి, రామారావుతో పాటు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసిన గిరిజన నాయకులు



మంత్రిని కలిసిన సిలోనిబావి తాండ నాయకులు

**వెల్దండ, జూన్11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సిలోనిబావి తాండకు చెందిన గిరిజన నాయకులు ఆదివారం శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సిలోనిబావి తాండ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరడంతో మంత్రి సానుకూలంగా స్పందించారని లాక్యానాయక్ పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలోరవినాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## బాల కార్మికుల హక్కులను కాలరాస్తే చర్యలు తప్పవు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**వెల్దండ, జూన్11 ప్రభాతవార్త:** ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రామిక వికాస్ కేంద్రం కొల్లాపూర్ చైల్డ్ రైస్ బెంగళూర్ వారి సహకారంతో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యాబాలల హక్కు, బడీడూ పిల్లలు బడిలోనే ఉండాలని, బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, బాలలు కార్మికులుగా కనిపిస్తే పోలీస్, రెవెన్యూ, కార్మిక శాఖకు సమాచారమివ్వాలని బాలల హక్కుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచుకుంట్లసుభాష్ అన్నారు.కార్యక్రమంలో గురుమూర్తి, రమేష్, రాంబాబు,ఎల్లేష్, లింగయ్య, ప్రభాకర్, శివ, పాండుచారి, కృష్ణతో పాటు తదితరులు ఉన్నారు. అన్నారు.

## పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో ధ్యానంపై అవగాహన సదస్సు



నాగసానిపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ధ్యాన ప్రచార కర్త గుండం శైలజ

**శ్రీరంగాపురం, జూన్11, ప్రభాతవార్త:** ధ్యానం ద్వారా శరీరంలోని 2లక్షల 72వేల నాడులు శుభ్రపడతాయని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయ రెడ్డి, ధ్యాన ప్రచారకర్త గుండం శైలజ అన్నారు.ధ్యానం చేసే సమయంలో విశ్వ శక్తి ప్రసారం జరుగుతుందని వారన్నారు.ఆదివారం శేరుపల్లి, నాగసానిపల్లి,నాగరాల, కంబాలాపురం గ్రామాలలో ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ప్రమాదకరమైన గుండె జబ్బులు,బిపి షుగర్‌వ్యాధులను రాకుండా కాపాడు కోవచ్చని వారన్నారు. ధ్యానం చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వారన్నారు. భవిష్యత్తులో వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని అన్నారు. ప్రతి దినం ధ్యానం చేయడం ఒక దినచర్యగా మార్చుకోవాలని వారు సూచించారు.ధ్యానం చేయడం ద్వారాఎలాంటి జబ్బులనైనా తగ్గించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు శ్రీనివాస్, సంగు వెంకటేశ్వర్లు, కృష్ణ, మద్దిలేటి,వెంకటలక్ష్మి, రాధ, సుభద్ర, స్వప్న, రామచంద్రయ్య, విజయ్‌కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## మండల కేంద్రం నుండి నేరుగా గ్రామాల పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలి

- కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి మురళి



**వీపనగండ్ల ,జూన్11,ప్రభాతవార్త:** జూన్ 12వ తేదీ నుండి 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాఠ్య పుస్తకాలు మండల కేంద్రం నుండి అన్ని గ్రామాలకు మొదటి రోజే సరఫరా చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్య పుస్తకాలను గ్రామాలలోని పాఠశాలలకు మండల వనరుల కేంద్ర అధికారులు నేరుగా పంపిణీ చేయాలని కుల వివక్ష, వ్యతిరేక పోరాట సమితి వీపనగండ్ల మండలం ప్రధాన కార్యదర్శి మురళి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జిల్లా బుక్ పాయింట్ నుండి మండల కేంద్రానికి చేరుకున్న పాఠ్యపుస్తకాలను గ్రామాలలోని పాఠశాలలకు తీసుకువెళ్లాలంటే పాఠశాల సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని మురళి అన్నారు. ప్రభుత్వ అధికారులు గ్రామాలలోని రవాణా ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని మండల వనరుల సిబ్బంది గ్రామాల పాఠశాలలకు పాఠ్య పుసనతకాలను చేరవేసే విధంగా చర్యలు తీసుకోవాలని మురళి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా విద్యార్థులకు బోధన, బోధనేతర సిబ్బంది కొరత లేకుండా చూడాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## మండల కేంద్రంలో ఐటిఐ, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రామకృష్ణ

**వీపనగండ్ల,జూన్11,ప్రభాతవార్త:** 2023-24 విద్యా సంవత్సరం వీపనగండ్ల మండల కేంద్రంలో ఐటిఐ , డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఎంతో మంది పేద విద్యార్థులు వీపనగండ్ల మండల కేంద్రం నుండి చాలా దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తుందని ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్న పని అని దీంతో చాలా మంది విద్యార్థులు, తల్లి దండ్రులు ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతున్నారని రామకృష్ణ అన్నారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చొరవ తీసుకుని వీపనగండ్ల మండల కేంద్రంలో ఐటిఐ, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## వారణాసి నాగేశ్వరాచారికి ఘన సన్మానం



నాగేశ్వరాచారిని సన్మానిస్తున్న కలెక్టర్

**గద్వాల ప్రతినిధి, జూన్11 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రలోని బాలభవన్‌లో ఆదివారం తెలంగాణ సాహిత్య దినోత్సవం వేడుకలలో భాగంగా కవి సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఐదు శతకములు రచించిన ప్రజ్ఞాశాలి, ప్రముఖ కవివరేణ్యులు వారణాసి నాగేశ్వరాచారి బాలభవన్‌లో నిర్వహించిన కవి సమ్మేళన కార్యక్రమంలో,తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కెసిఆర్‌పై పద్యరూపంలో కవిత్వం వినిపించారు.అనంతరం జరిగిన సన్మాన కార్యక్రమంలో జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత,కలెక్టర్ వల్లూరు క్రాంతి చేతుల మీదుగా పూలమాల, ప్రశంశా పత్రంతో ఘనంగా సన్మానించారు.

## ఈఓ పురెందర్‌కుమార్‌కు నోడల్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు



**గద్వాల ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించేందుకు జోగులాంబ గద్వాల జిల్లా నోడల్ ఆఫీసర్‌గా జోగులాంబ గ్రేడ్ 1 హోదాలో ఉన్న జోగులాంబ ఈఓ పురందర్ కుమార్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పజెప్పుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జోగులాంబ గద్వాల జిల్లాలోని దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న అన్ని ఆలయాల్లో ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించేందుకు వారికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పజెప్పింది. ఈఓ పురెందర్‌కుమార్, గద్వాల జిల్లాలోని దేవాదాయ శాఖ పరిధిలో గల అన్ని ఆలయాలను, అక్కడి అధికారులను పాలక మండల్ని భక్తులను సమన్వయపరచుకుని ఆయా ఆలయాల్లో చేపట్టాల్సిన టువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలపై తగు సూచనలు, సలహాలు ఇస్తూ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు.

## అస్తవ్యవస్థగా డ్రైనేజీ..రోడ్డుపైనే పారుతున్న నీరు

● పట్టించుకోని అధికారులు



1) డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక రోడ్డుపై పారుతున్న నీరు, (2) వీపనగండ్ల నుండి అమ్మాయిపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో అడ్డంగా పడిపోయిన చెట్టు, (3) 6వ వార్డులో పగిలిపోయిన మ్యాన్ హోల్

**వీపనగండ్ల,జూన్11,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో పలు సమస్యలు ఉన్నాయని ప్రజలు అనుకుంటున్నారు. మండల కేంద్రంలోని నరసింహనగర్ రోడ్డు మార్గంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక రోడ్డుపైనే నీరు ఉండడం వలన దోమలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.అదే విధంగా మండల కేంద్రంలోని గిర్ని నుండి ఆరో వార్డు రోడ్డులో మ్యాన్‌హోల్ పగిలిపోయి కొన్ని నెలలు అయిపోయిన, ఎన్నో సార్లు సమస్యలు వివరించిన కూడా స్పందించడం లేదని ప్రజలు అంటున్నారు.అధికారులు పట్టించు కోవడం లేదని 6వ వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుండి అమ్మాయిపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో గాలికి చెట్లు విరిగిపోయి రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న వాటిని తొలగించే వారు లేరని దీని వలన రోడ్డు మార్గం వెళ్లే వారికి చాలా ఇబ్బందిగా ఉందని ప్రజలు అంటున్నారు.ఇప్పటికైనా అధికారులు మేల్కొని డ్రైనేజీ వ్యవస్థను , మ్యాన్ హోల్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు అనుకుంటున్నారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రన్ కార్యక్రమం

**కోయిల్‌కొండ,జూన్ 11 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు నారాయణపేట జిల్లా కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని ఎంపిపి, జడ్పీటిసి, మండల ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు విధిగా రావాలని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బి. కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.కార్యక్రమం నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ఆదేశాలమేరకునారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలం నుండి టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీగాతరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే సబ్బండ వర్గాలకు అభివృద్ధి



సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న వికలాంగులు, బిఆర్ఎస్ నాయకులు

**శ్రీరంగాపురం, జూన్11, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పాత గ్రామ పంచాయతీ ఆవరణంలో ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం చేయడం జరిగింది. ఇటీవల తెలంగాణలో దివ్యాంగుల పెన్షన్‌ని వెయ్యి రూపాయలు పెంచుతూ మంచిర్యాల సభలో సీఎం కేసీఆర్ ప్రకటన చేసిన సందర్భంగా మండల బీఆర్ఎస్ పార్టీ వికలాంగుల ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. పలువురు వికలాంగులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో వికలాంగుల పెన్షన్ 3116 నుండి 4116 కు పెంచడం పట్ల ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెంచిన పెన్షన్ వచ్చే నెల నుండి అమల్లోకి వస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారనీ, అలాగే యువత తెలంగాణ సమాజం బాగుండాలని, తెలంగాణరాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముసలమ్మలు, ముసలితాతలు ఆసరా పెన్షన్‌లతో సంతోషంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి పృధ్వీరాజ్, సర్పంచ్ వినీలరాణి కురుమయ్య, ఉప సర్పంచ్ చీర్ల శివసాగర్, కో ఆప్షన్ సభ్యులు ఆరిఫ్, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు వెంకటస్వామి, గ్రామ అధ్యక్షులు మహేష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు నరేష్ నాయుడు, గొడుగు సత్యనారాయణ, బొల్లెద్దుల ఆంజనేయులు,గుంటి వెంకటేష్, ఎండి సిరాజుద్దీన్, పరుశరాం యాదవ్, సయ్యద్, సొప్పరి బీసన్న, వికలాంగులు , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మన్యంకొండలో ఘనంగా తిరుచ్చిసేవ

-అలంకరణలో శ్రీదేవిభూదేవి సమేతంగా స్వామివారి దర్శనం



మన్యంకొండలో తిరుచ్చిసేవపై ఉన్న స్వామివారికి హారతి ఇస్తున్న పూజారి

**దేవరకద్ర, జూన్ 11 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిఎవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవిభూదేవి సమేతంగా స్వామివారి తిరుచ్చి సేవను నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాలు,భక్తుల హరినామస్మరణ,కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు.అనంతరం స్వామి వారిని మళ్ళీ గర్భగుడిలోకి తీసుకెళ్లారు. అక్కడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు:** మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవపై శ్రీదేవిభూదేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు, బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్ కుమార్,అళహరిరామకృష్ణ,ఈఓశ్రీనివాసరాజు, ప్రధాన పూజారులురాజేశ్, నరసింహ్మయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యా నందచారి, సిబ్బంది సుదర్శన్,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హామీలకే పరిమితమైన తెలంగాణ ప్రభుత్వం

- బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్



**వనపర్తి టౌన్,జూన్11,ప్రభాతవార్త:** అమాయక గిరిజన ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని హామాలు నెరవేర్చడంలో శూన్యమని కేసీ ఆర్ అధికారంలోకి వచ్చే తొమ్మిదేళ్లు గడుస్తున్న గిరిజనులను సంక్షేమ హామీలు పేరుతో మోసం చేస్తున్నారని బంజారా గిరిజన విద్యార్థి సమా ఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్ అన్నారు. కేసీఆర్ గిరిజనులకు ఇస్తాన న్న మూడు ఎకరాల భూమి ఎటు పోయే గిరిజన బందు ఎటు పోయే అని బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్, వాపోయారు. అమాయక గెలిచిన ప్రజలను ఓట్ల కోసమే వాడుకుంటు న్నారని గెలిచిన తరువాత మాట మారుస్తున్నారని ప్రతి నియోజకవర్గంలో తాండ తాండల్లో గిరిజనులు అనేక కష్టాలు పడుతున్నారు, పోడు భూము లకు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారనివారినిఆదుకోవాల్సిన ప్రభు త్వమే మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. త్వరలోనే ఇచ్చిన హామీని నెరవేర్చకపోతే కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని డిమాండ్ చేశారు.

## బిజెపి, కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిక

● కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పార్టీలో చేరిన గౌడ సంఘం నాయకులు

**గద్వాల ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్దకల్ మండల కేంద్రానికి చెందిన గౌడ్‌సంఘం నాయకులు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో బిజెపి పార్టీ నాయకులు నారాయణగౌడ్, మురళిగౌడ్, కృష్ణయ్యగౌడ్, తిమ్మప్పగౌడ్, బిజెపి పార్టీని విడిచి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు ఆంజనేయులుగౌడ్, నర్సింహులుగౌడ్, తిరుమలేష్‌గౌడ్, నర్సింలుగౌడ్, తిరుమలగౌడ్, మల్దకల్ గౌడ్, రాజుగౌడ్, గోవర్ధన్‌గౌడ్,నర్సింహులుగౌడ్,ప్రవీణ్‌కుమార్‌గౌడ్, వీరేందర్‌గౌడ్, ధర్మేష్ గౌడ్,ఓబులేష్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, శేషుగౌడ్, నాగన్నగౌడ్, రామన్న, రామన్‌గౌడ్,వెంకటేష్‌గౌడ్, చిన్న నరసింహులుగౌడ్, తిప్పన్నగౌడ్, తిరుమలేష్‌గౌడ్, రాజన్నగౌడ్, అశోక్‌గౌడ్‌లకు గులాబీ కండువా కప్పి బిఆర్ఎస్ పార్టీకి ఆహ్వానించారు.కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపిపి రాజారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటన్న, బిఆర్ఎస్ పార్టీ నాయకులు అజయ్, నరెందర్, మధునాయకి, ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి బిఆర్ఎస్‌లో చేరికలు : ఎమ్మెల్యే ఆల

**చిన్నచింతకుంట, జూన్ 11 ప్రభాతవార్త:** కెసిఆర్ సారథ్యంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోప్యానాయక్ తండాలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన 50మంది గిరిజన యువత ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి బిఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని గిరిజన యువతను ఎమ్మెల్యే కోరారు.ఎమ్మెల్యే సమక్షంలో వెంకటేష్ నాయక్, నరేష్‌నాయక్, శంకర్‌నాయక్, సురేష్‌నాయక్, శివనాయక్, శ్రీనునాయక్, గోపాల్ నాయక్, అశోక్ నాయక్‌తో పాటు 50మంది గిరిజన యువత పార్టీలో చేరారు.

# పల్లె, తండాల్లో ఐక్యత సేవలను విస్తృత పరుస్తా

- ప్రజల అభ్యున్నతే.. నా ఆశయం
- విద్య, వైద్యం, ఉపాధితో ముందుకు సాగుతా...
- ప్రజలు చూపిస్తున్న ప్రేమతో మరింత ముందుకు సాగుతా...
- మాడ్గుల మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ కార్యాలయం ప్రారంభం
- ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



స్వర్గీయ సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

**కల్వకుర్తి, జూన్ 11 ప్రభాతవార్త:** తాను పుట్టి పెరిగిన ఊరు, తన నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఐక్యత ఫౌండేషన్‌ను స్థాపించి ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా కోట్లాది రూ॥లు వెచ్చించి విద్య, ఉద్యోగ, వైద్య అవకాశాలను కల్పిస్తూ పల్లె, తండాల అభివృద్ధికై నిధులు వెచ్చించి అభివృద్ధికి పాటు పడుతున్నాడు. అనతి కాలంలోనే నియోజకవర్గ ప్రజలకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి దగ్గరయ్యారు. సమాజంలో ఆర్థిక, అసమానతలు తొలగి పోవాలంటే విద్యతో పాటు వైద్యం, ఉపాధి అవకాశాల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి అనేక కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తున్నారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం రాత్రనక, పగలనక నిరంతరంగా ఫౌండేషన్ ద్వారా నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు ప్రవాస భారతీయులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి. అమెరికా పౌరసత్వాన్ని వదులుకొని తన నియోజకవర్గ అభివృద్ధికై కంకణం కట్టుకొని ముందుకు సాగుతున్నారు. ఐక్యత ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తూ... పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువకులకు అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లతో శిక్షణ తరగతులను అందిస్తున్నారు. మాడ్గుల మండల కేంద్రంలో నూతనంగా ఐక్యత ఫౌండేషన్ కార్యాలయాన్ని ఆదివారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి భారీ కాన్వాయితో రాగా మండల ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. అంబేద్కర్, పూలే విగ్రహాలకు, స్వర్గీయ కేంద్రమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి, ఇందిరగాంధీ విగ్రహాల వద్ద చేరుకొని గజమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత 10 సంవత్సరాల క్రితమే ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని, 6 నెలల కాలంలో ఐక్యత ఫౌండేషన్‌ను విస్తృత పరుస్తూ 150 గ్రామాల్లో పర్యటించి ఇచ్చిన హామీలను నేరవేరుస్తూ దేవాలయాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఆమనగల్లు, కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రుల వద్ద 9 అంబులెన్స్‌ల ద్వారా 1500 మంది వైద్య చికిత్సలకు ఆసుపత్రులకు తరలించడం, ఎంతో మందికి ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తూ అందరి గుండెల్లో స్థానం సంపాదించడం ఎంతో సంతోషంగా ఉందని, కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి గడపకు చేరుకుంటానని, వచ్చే 20 సంవత్సరాలతో మీతోనే కలిసి ఉంటానన్నారు. ప్రజలు చూపిస్తున్న ఆదరణాభిమానాలను ఎప్పటికి మరిచిపోనని ఆయన పేర్కొన్నారు. అనంతరం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ ప్రారంభించారు.



కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

**మండలంలో ఐక్యత ఫౌండేషన్ ఇన్‌చార్జిల అలసత్వం:** ఐక్యత ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, ఉపాధే లక్ష్యంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన వసతులు, సదుపాయాలు కల్పించాలని ఫౌండేషన్ చైర్మన్ అహర్నిశలు కృషి చేస్తుంటే... మాడ్గుల మండలంలో మాత్రం ఇన్‌చార్జిలు ఆ దిశగా పనిచేయడానికి అసక్తి కనబర్చడం లేదు. కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రానికి 50 కిలో మీటర్ల దూరంలో ఉన్న మాడ్గుల మండల కేంద్రం పూర్తిగా వెనుకబాటు తనానికి గురైంది. ఫౌండేషన్ చైర్మన్ మాడ్గుల మండలాన్ని సందర్శించి మాడ్గుల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని హామీ ఇచ్చినప్పటికి ఇన్‌చార్జిలు మాత్రం ఆ దిశగా పనిచేయడం లేదు. మండల కేంద్రంలో ఫౌండేషన్ కార్యాలయంఎప్పుడో ప్రారంభం కావాల్సి ఉండగా...ఇన్‌చార్జిల అలసత్వం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైంది. కార్యాలయ ప్రారంభోత్సవానికి మండలం నుంచి జనసమీకరణ చేపట్టిన వారికి సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. విద్య, వైద్యం, ఉపాధి ఆ దిశగా ఫౌండేషన్ చేపట్టే సేవలు మాడ్గుల మండలానికి పూర్తి స్థాయిలో అందుతాయో లేదో వేచి చూడాల్సిందే. కార్యక్రమంలో ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి, సురేష్‌నాయక్, సూదిని జైపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, రమేష్‌నాయక్, ఆయా గ్రామాల ప్రజలు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.



కాన్వాయిలో ప్రజలకు అభివాదం చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

- 21 సంవత్సరాల తరువాత కలుసుకున్న బాల్య మిత్రులు



**పెద్దమందడి, జూన్11, ప్రభాతవార్త:** పెద్దమందడి మండల కేంద్రంలో 2001-02 సంవత్సరంలో జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. 21 సంవత్సరాల తరువాత కలుసుకున్న బాల్య మిత్రులు ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుని ఆనందంగా గడిపారు. మొదటగా విద్య నేర్పిన గురువులను సన్మానించారు. బాల్య మిత్రులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం విద్యార్థినీవిద్యార్థులకు జ్ఞాపికలుఅందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ ,కృష్ణయ్య, వెంకటప్రసాద్, మద్దిలేటి, వరలక్ష్మి, విద్యార్థులు మల్లేష్ యాదవ్, పాండు, కిషన్, అశోక్, శేఖర్ తదితరులు ఉన్నారు.

## జోగులాంబ దేవిని దర్శించుకున్న ఎంపి రాములు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి



జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ చల్లా

**అలంపూర్, జూన్ 11 ప్రభాతవార్త:** అలంపూర్ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను ఆదివారం ఎంపి పోతుగంటి రాములు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రమిరెడ్డి దర్శించుకున్నారు. ఈసందర్భంగా దేవస్థానం ఈఓ పురందర్‌కుమార్, ఛైర్మన్ బోయ చిన్నకృష్ణయ్య ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి ఘన స్వాగతం పలికారు. ముందుగా బాల బ్రహ్మేశ్వర స్వామివారిని దర్శించి అనంతరం జోగులాంబ అమ్మవారి ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పాలక మండలి ఛైర్మన్, ఎంపి ఎమ్మెల్సీలను శాలువాలతో సత్కరించారు. ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం చేశారు.

## బాధితునికి ఫోన్ అప్పగింత



బాధితునికి ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

**చిన్నచింతకుంట, జూన్ 11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన హరిజన మాసన్నకు చెందిన రూ. 15 వేల విలువ గల ఫోన్ పోగొట్టుకోగా బాధితుడు ఐదు రోజుల క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈఐఆర్ పోర్టల్ ద్వారా ఐదు రోజులలో ఫోన్ ఆచూకీ కనుగొని ఆది వారం పోలీస్ స్టేషన్‌లో బాధితునికి ఫోన్ అప్పగించినట్లు ఎస్సై వి.మోహన్ బాబు తెలిపారు.

**2కె రన్‌వేను విజయవంతం చేయండి:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం 2కె రన్‌లో యువత పాల్గొని విజయవంతం చేయాలని ఎస్సై వి.మోహన్‌బాబు కోరారు. జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశానుసారం భూత్పూర్ సర్కిల్‌లోని కాటవరం స్టేజీనుండి అడ్డాకుల పోలీస్ స్టేషన్ వరకు చేపట్టనున్న తెలంగాణరన్ కార్యక్రమానికి జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రవినాయక్, అదనపు కలెక్టర్ సీతారామారావులు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని ఎస్సై తెలిపారు. 2కె రన్‌వేలో మండల యువత అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## సీఎం కేసీఆర్ పాలనలో వృద్ధులకు, వికలాంగులకు ఆత్మ గౌరవం పెరిగింది

- మున్సిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్



**వనపర్తి టౌన్, జూన్11, ప్రభాతవార్త:** సమైఖ్య రాష్ట్రంలో దివ్యాంగుల కష్టాలు అన్ని ఇన్ని కావని, అయినప్పటికీ వారిని పట్టించుకున్న పాపాన పోలేదని, సీఎం కేసీఆర్ పాలనలో వృద్ధులకు వికలాంగులకు ఆత్మ గౌరవం పెరిగిందని మున్సిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. నెలనెలా వచ్చే రూ.500 పెన్షన్ సైతం సరిగా ఇచ్చే వారు కాదని , వ్యవస్థపై ఆధారపడకుండా వారంతట వారే అందరిలాగా బతకాలనే సదుద్దేశ్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగులకు రూ.3వేలు పెన్షన్ ఇచ్చారని, ఇప్పుడు ఎవరు అడగకముందే దానిని రూ.4016కు పెంచారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ సంపదను పెంచి పేదలకు పంచారని ఇంటికి పెద్ద కొడుకులా నెల నెలా వృద్ధులకు వికలాంగులకు పెన్షన్లు ఇస్తున్నారని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలతో పేదింటిలో వెలుగులు నింపుతున్నారని ఆయన అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వీపనగండ్ల మండల ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతుంది

**వీపనగండ్ల, జూన్11, ప్రభాతవార్త:** గోవర్ధనగిరి నుండి వీపనగండ్ల మండల కేంద్రం నుండి కొల్లాపూర్ వెళ్లే రోడ్డు ఆదివారం వీపనగండ్ల మండల కేంద్రం నుండి గోవర్ధనగిరికి బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ...ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చొరవతో, వీపనగండ్ల మండల కేంద్రాన్ని అభివృద్ధి చేయాలనే సదుద్దేశ్యంతో రోడ్డు మార్గం పనులు చాలా వేగవంతంగా చేశారని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వీపనగండ్ల మండల ప్రజలు ఎన్నో ఏళ్ల నుండి ఇలాంటి రోడ్డు కోసంఎదురు చూస్తున్నారని అన్నారు. ఆదివారం డబుల్ రోడ్డు పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు నాణ్యతను సీఎం నాయకులు మురళి, నక్క ఈశ్వర్, రామకృష్ణ, నవీన్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ..రోడ్డు నిర్మాణ పనులను నాణ్యవంతంగా చేపట్టాలని, నాణ్యతతో కూడిన కంకర ఉపయోగించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ కమలేశ్వర్ రావు, కో ఆప్షన్ సభ్యురాలు మౌలానాబీ రజాక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ చాపల సాయిబాబా, సగనమోని రామచందర్ పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి బిఆర్ఎస్‌లో చేరికలు



**చిన్నచింతకుంట, జూన్ 11 ప్రభాత వార్త:** కెసిఆర్ సారథ్యంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలలోని గోప్యనాయక్ తండాలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన 50మంది గిరిజన యువత ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి బిఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని గిరిజన యువతను ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే సమక్షంలో వెంకటేష్ నాయక్, నరేష్‌నాయక్, శంకర్‌నాయక్, సురేష్‌నాయక్, శివనాయక్, శ్రీనునాయక్, గోపాల్ నాయక్, అశోక్ నాయకతో పాటు 50మంది గిరిజన యువత పార్టీలో చేరారు.

## సాహితి సౌరభాలను గుబాళించిన దశాబ్ది వేడుక



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత

**గద్వాల ప్రతినిధి, జూన్11 ప్రభాతవార్త:** సాహితా సౌరభాలను గుబాళించిన దశాబ్ది వేడుక, ఘనంగా తెలంగాణ సాహిత్య దినోత్సవాలకు జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిలు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బాల భవన్‌లో తెలంగాణ సాహిత్య దినోత్సవం అట్టహాసంగా జరిగింది. కవులు, కవయిత్రులు, సాహితీ వేత్తలు ఉత్సాహంగా తరలివచ్చి తమ పద్య, వచన కవిత్వాలతో తెలంగాణ ఔన్నత్యాన్ని ఆవిష్కరింపజేశారు. జిల్లా సాహిత్య సౌరభాల గుబాళింపులకు వేదిక అయ్యింది. జ్యోతి ప్రజ్వలనతో కవి సమ్మేళనం కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి కలిసి ప్రారంభించారు. కవి సమ్మేళనంలో పాలొనగన్న 40 మంది కవులందరిని ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక రూ.1,116లు నగదు పారితోషికం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావానికి కవులు, కళాకారులు చేసిన కృషి పట్ల ఛైర్మన్ ప్రశంసలు కురిపించారు. తెలంగాణ సాధనలోకష్టపడిన కవులు, కళాకారులను సన్మానించుకునే రీతిలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు సముచిత స్థానం కల్పించి ఆదరిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు అయిన తర్వాత వచ్చిన అభివృద్ధి ఫలాలను ప్రజలకు వివరించేందుకు 21 రోజులపాటు దశాబ్ది వేడుకలు నిర్వహించి రోజుకు ఒక పండగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యపరిచే కవితలు రాసి రాష్ట్రాన్ని, జిల్లాను మరింత అభివృద్ధి దిశగా నడపించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట21 రోజులపాటు ప్రతిరోజు పండగ నిర్వహిస్తూ ప్రజలకు అభివృద్ధిని వివరిస్తున్నట్లు తెలిపారు. రైతుల పండగ, చెరువుల పండగ, పరిశ్రమల ప్రగతి తదితర పండగలను ఏర్పాటు చేసుకుని వేడుకగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాహిత్య రంగానికి చెందిన కవులు ఉత్సాహంగా రాష్ట్రం ఏర్పడేందుకు కృషిచేశారని అన్నారు. మన జిల్లాలో గడియారం రామకృష్ణశర్మ, సురవరం ప్రతాప్‌రెడ్డి లాంటి కవులు ప్రజలకు దారి చూపారని వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కవులు ఇంకా సాహితీరంగంలో ముందుకు వెళ్లి అందరిని ప్రోత్సహించే రీతిలో కవితలు రాయాలన్నారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ అపూర్వ చౌహాన్, ఈడి రమేష్‌బాబు, డిపిఆర్ఓ చెన్నమ్మ, డీఈఓ కార్యాలయ అధికారి ఇందిర, కవులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-1 పరీక్షలు



గ్రూప్-1 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి, జూన్11, ప్రభాతవార్త:** ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ - 1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టరన తేజస్ నందలాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గ్రూప్ -1 పరీక్షలు రాసే అభ్యర్థులకు 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 4,343 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 3,173 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్లు, 1170 మంది అభ్యర్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. జిల్లావ్యాప్తంగా 73.06 శాతం హాజరు నమోదు అయినట్లు ఆయన తెలిపారు.

### నేటి తెలంగాణ రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి: కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి, జూన్11, ప్రభాతవార్త:** దశాబ్ది వేడుకలలో భాగంగా ఈనెల 12వ తేదీన పోలీస్ శాఖ క్రీడా యువజన శాఖ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు తెలంగాణ రన్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలనుండి ఏకో పార్కువరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, విద్యార్థులు ప్రజాప్రతినిధులు, ప్రజలుహాజరైకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

### జనసేన పార్టీ గోపాల్‌పేట మండల అధ్యక్షుడిగా మూర్తి నాయక్

**వనపర్తి క్రైమ్, జూన్11, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని వనపర్తి నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకై పూర్తిస్థాయిలో పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రణాళికతో అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని బలపరుస్తు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర ఇంచార్జ్ నాయకులు నేమూరి శంకర్‌గౌడ్ అన్నారు. గోపాల్‌పేట మండల జనసేన పార్టీ కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. అధ్యక్షులుగా కాత్రావత్‌కురుమూర్తి నాయక్, ఉపాధ్యక్షులుగా కొరమోని శివ, తెలుగు శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా చుక్క ప్రవీణ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోకల రమాకాంత్, వెంగలయ్య లింగస్వామి, చుక్కమధు, సెక్రటరీ కొంకల బాలకృష్ణ, అంగోత్ రవీందర్, కార్యవర్గ సభ్యులుగా వడ్డెమాన్ సాయిబాబు, చిన్న కోటయ్య, గుజ్జుల ఆంజనేయులు , చెండి రాహుల్, రాపోతు చందు, హనుమంతు లను ఎన్నుకున్నారు.

### ఘనంగా తెలంగాణ సాహిత్య దినోత్సవం

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో శిల గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కవులమధ్యన ఘనంగా నిర్వహించారు. తెలంగాణ అస్తిత్వము తెలంగాణ ప్రగతి అనే అంశంపై కవి సమ్మేళనానికి హాజరైన తెలుగు,హిందీ, ఉర్దూ కవులుతమ కవితల రూపంలో చదివి వినిపించారు. కార్యక్రమంలో బాలకేంద్రం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు వీణ వాయిద్యం, పియానో చూపరులకు ఆకట్టుకున్నాయి. సాహిత్య కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులకు సన్మానంతోపాటు ప్రతి ఒక్కరికి ప్రశంసా పత్రాలు, పారితోషికాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు కృష్ణమాచారి, జ్యోతి, కన్యాకుమారి, వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్ సునిత, కవులు, బాల కేంద్రం నిర్వాహకులు ప్రజలు పాల్గొన్నారు.

## నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన

### 2వేల మంది పోలీసులతో పకడ్బందీగా పోలీస్ బందోబస్తు : జిల్లా ఎస్పీ కె. సృజన



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సృజన

**గద్వాల ప్రతినిధి, జూన్ 11 ప్రభాతవార్త:** నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా 2 వేల మందితో పకడ్బందీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ కె. సృజన అన్నారు. నేడు జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని, జిల్లా పోలీస్ కార్యాలయాన్ని, కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించడానికి అనంతరం బహిరంగ సభకు ముఖ్యమంత్రి వస్తున్న సందర్భగా బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి పట్టణంలోని కెఎస్ ఫంక్షన్ హాల్‌లో బందబోస్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలగురించి తగు సూచనలు చేశారు. సిబ్బంది అందరు ఇంచార్జి అధికారుల సూచనలతో ఎస్ఓపిని అనుసరించి విధులు నిర్వహించాలని అన్నారు. నేడు సాయంత్రం జరగబోయే ముఖ్యమంత్రి సభకు వచ్చే వారికి వాహనాలు పార్కింగ్ ప్రదేశాలలో అయిజ, మల్దకల్ రోడ్డు నుండి వచ్చేవారు ఔటర్ రింగ్ దగ్గర కుడ వైపు పార్కింగ్ ప్రదేశంలో వాహనాలు నిలుపుకోవాలని, ధరూర్ రోడ్డు నుండి వచ్చే వారు నోబుల్ స్కూల్ దగ్గర ఔటర్ రింగ్‌రోడ్డు ఎక్కి అయిజ రోడ్డు వరకు వచ్చి దర్గా వైపు ఉన్న పార్కింగ్ ప్రదేశంలో వాహనాలను నిలుపుకోవాలని అన్నారు. ఎర్రవలిల రోడ్డునుండి వచ్చేవారు తమ వాహనాలను జమ్మిచేడు దగ్గర లెఫ్ట్ తీసుకుని మేళ్లచెరువు రోడ్డు గుండా పిల్లిగుండ్ల కాలనీ దగ్గర ఉన్న పార్కింగ్ ప్రదేశంలో వాహనాలు నిలపాలని నేడు సాయంత్రం గద్వాల పట్టణంలో ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందని వాహనదారులు గమనించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ ఎస్పీలు నరసింహులు, వెంకటేశ్వర్లు, మనోహర్, గద్వాల డీఎస్పీ రంగస్వామి, అదనపు ఎస్పీలు, వివిధ జిల్లాల నుండి వచ్చిన డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రుతుపవనాల అలస్యంతో.. అన్నదాతల్లో ఆందోళన

- ఈ ఏడాది ఆలస్యమైన రుతుపవనాలు
- జూన్ మొదటివారంలో రావల్సింది, ఇంతవరకు రాలేదు
- రోహిణిపోయింది..మృగశిర వచ్చింది
- 10 రోజులపాటు రుతుపవనాల అలస్యం



దేవరకద్ర మండలం అడవిఅజిలాపూర్ సమీపంలో విత్తనాలను విత్తుతున్న రైతులు (ఫైల్)

**దేవరకద్ర, జూన్11 ప్రభాతవార్త:** ఈ ఏడాది రుతుపవనాలు రాక ఆలస్యమైంది. దీంతో అన్నదాతల్లో అందోళన మొదలైంది. వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం దాదాపు 10 రోజుల పాటు రుతుపవనాలు అలస్యమయ్యాయి. జూన్ మొదటివారంలో రుతుపవనాలు రావల్సింది. కెరళ రాష్ట్రానికి మే చివరివారం, జూన్ మొదటివారంలో రుతుపవనాలు వచ్చి వర్షాలు మొదలయ్యేవి. ఈ ఏడాది వారం, పది రోజుల పాటు రుతుపవనాల అలస్యం కావడంతో రాష్ట్రంలో రుతుపవనాల జాగే కనిపించడం లేదు. ఇంతవరకు రుతుపవనాలు రాలేదు. కేవలంచల్లని గాలులు మాత్రం వీస్తున్నాయి. మే 25న రోహిణికార్తి ప్రారంభమైనప్పటి నుంచి అల్పపీడనం ప్రభావంతోనే రెండు రోజుల పాటు వర్షాలు కురిశాయి. జూన్7తో రోహిణికార్తి ముగిసి మృగశిరకార్తి వచ్చింది. కార్తి వచ్చి కూడ దాదాపు 5 రోజులవుతున్న...ఇప్పటివరకు వాన జాడ కనిపించడంలేదు. దీంతో రైతుల్లో ఆందోళన ప్రారంభమైంది. అయితే హైద్రాబాద్ వాతావరణంశాఖ మాత్రం రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలో చెదురుముదురు వర్షాలు కురిసే అవకాశం ఉందని చల్లని కబురు ప్రకటించింది. వానాకాలం పంటల సీజన్ ప్రారంభం మరింత ఆలస్యం కావడంపై రైతులలో ఆందోళనలు రేకెత్తుతున్నాయి. రోహిణికార్తిలో విత్తనం నాటితే మొలిచే మొక్కలో రోగనిరోధక శక్తి పెరిగి చీడపీడలను తట్టుకోవడంతో పాటు గణనీయంగా వస్తాయని రైతుల ప్రగాఢవిశ్వాసం. రోహిణికార్తి ప్రారంభంకాగానే పాలమూరు జిల్లాలో రైతులు చాలా ప్రాంతాలలో విత్తనాలను నాటడానికి పొలాలను సిద్ధం చేసుకొన్నారు. కాని వర్షాలు మాత్రం ప్రారంభం కాలేదు. ఇది ఇలా ఉండగా పాలమూరు జిల్లా వ్యాప్తంగా 2023-24 వర్షాకాలంలో 3,77,917 ఎకరాలలో అన్నిరకాల పంటలు సాగు చేస్తారని వ్యవయాధికారులు అంచనా వేశారు. ఇందులో దాదాపు 1,89,917 ఎకరాలలో వరి పంటను సాగు చేస్తారని అంచనా వేశారు. అలాగే పత్తి 1,15,845ఎకరాలు, మొక్కజొన్న 28,546 ఎకరాలు, జొన్న 13,015, కంది12,548, ఆముదం1,565, రాగులు 855, పెసర 195, మినుములు 65, ఉలవలు 81, వేరుశెనగ 69, చెరుకు 61, ఇతర పంటలు 405, కూరగాయల తోటలు 14,750ఎకరాల చొప్పున సాగు చేస్తారని అంచనా వేశారు. పంటలకు తగ్గట్లు రసాయనిక ఎరువుల ప్రణాళికను కూడ అధికారులు సిద్ధం చేశారు.

**వర్షాలు ఆలస్యమైతే.. సాగు మరింత వెనక్కి..**

వర్షాలు ఆలస్యమైతే..సాగు మరింత వెనక్కి అవుతుందని రైతుల్లో అందోళన ప్రారంభమైంది. జిల్లాలో వాతావరణ పరిస్థితులను ఎదుర్కోనేలా వానాకాలం పంటల, ఎరువుల ప్రణాళికలను సంబందిత అధికారులు ఖరారు చేశారు. జిల్లాలో నేలస్వభావాన్ని బట్టి ఏయే పంటలు ఏ మేరకు సాగవుతావోనని కూడ అంచనా వేశారు. అయితే ఈ వర్షాకాలం పంటలలో పత్తి, కంది, మొక్కజొన్న, జొన్న, చిరుధాన్యాల సాగు విస్తీర్ణ్యం పెరుగనుందని అంచనా వేశారు. పంటల సాగు విస్తీర్ణ్యంతో పాటు అవసరమయ్యే విత్తనాలు, ఎరువుల కూడ ప్రణాళికను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేశారు. ప్రతి ఏడాది వడగండ్ల వాన కురిసి పంటలకు పెద్ద మొత్తంలో పంట నష్టం జరుగుతుంది.

**ముందస్తు నాట్లు..ముందస్తు కోతలకు అధికారుల కసరత్తు**

వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా నాట్లు వేయించి, ముందస్తుగా కోతలు కోయించేలా అదికారులు కృషి చేస్తున్నారు. ఈ సీజన్ నుండే ఈ నిర్ణయాన్ని అమలుచేసేలా తగు చర్యలు తీసుకొంటున్నారు. ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ దిశగా మండల వ్యవసాఅధికారులు, విస్తరణాధికారులు రైతులకు అవగాహన కల్పించడానికి కృషిఛేస్తున్నారు. సాధారణంగా ప్రతి ఏడాది వానాకాలంలో వరినాట్లను జులైలో ప్రారంభించి సెప్టెంబరు వరకు వేస్తారు. దీంతో వానాకాలం కోతలు అలస్యమై యాసంగిపై ప్రభావం చూపుతుంది. దీని వల్ల యాసంగి కోతలు మే నెల వరకు జరుగుతాయి. దీంతో వరిపంట పొట్టదశలో ఉన్నప్పుడు మార్చి, ఎప్రిల్ నెలలో వడగండ్లు పడి తీవ్ర పంట నష్టం జరుగుతుంది. దీనికిఅధిగమించేందుకుముందస్తుగా నాట్లు వేయించాలలని అధికారులు భావిస్తున్నారు. అందుకే జూన్ 15లోగా నారుపోసుకొని, జులై 15లోగా నాట్లు పూర్తి చేసేలా అధికారులు చూస్తున్నారు. అలాగే యాసంగిలో నవంబరు 15లోగా నారు పోసుకొని డిసెంబరు 15లోపు నాట్లు వేసేలా ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలను సైతం జారి చేసింది.